# రాగమాలిక

నాలోకి నేను మాయమయ్యే క్షణం... మాయమైన నా లోని నా నించీ ప్రపంచం విడుదలయ్యే క్షణం...

నా చేతిలోని వాయులీనం, కొన్ని కోట్ల సంవత్సరాల వసంతాలను మలుచుకుంటూ వచ్చి చైతన్యమై, దైన్య భావన శిథిలమైన రాగమోహంగా

మెట్టు మెట్టూ....

ఆహిర్ భైరవ్....!

"చక్కరవాకం.... నీదనిరీసా.... యిదే కదు నాన్నా!"

"చక్రవాకం కర్నాటకంలోరా అమ్ములూ...! నాన్నారు పలికిస్తోంది హిందూస్తాన మన్నమాట... హిందూస్తానమంటే... మనమలా... వెళ్తోవెళ్తో ఉంటే... మంచు కప్పేసిన చల్లటి తెల్లటి కొండలొస్తాయన్న మాట. అక్కడిదీ ఆ సంగీతం..." ముసల్ది ఒళ్ళో కూచున్న చిన్ని 'యాదకుల కాంబోజి'కి చెబుతోంది సంగీతమంటే...!

కమానుకీ తీగకీ మధ్య ఒరిపిడిలోంచీ పుట్టే శబ్దం మధ్య నించీ, అటు ప్రదోష సంగీతంలా అమ్మనీ, ఇటు ప్రత్యూష గీతంలా బుజ్జిముండనీ.... వింటూనే వున్నా నేను.

జీవ భావ సంగీతమిది మరి....!

నేను బుజ్జిముండని చెబుతూన్న ఆ మల్లికా ప్రసూనకానికి అయిదు వసంతాలు. ఒకటిన్నరేడుకే 'సరస్వతీ నమస్తుభ్యం....' పలికిన చైతన్యం...!

డెబ్భై రెండు మేళకర్తల్లో దాదాపు ముప్పయి రాగాలు అలవోకగా అలా గుర్తించేయగల్దు.

భగవద్దర్శనానికి దేవాలయాలవసరం లేదనే వాళ్లతో ఏకీభవించటానికి మా బుజ్జిముండే చాలు నిదర్శనానికి.

రజనీ ఘోష్ పాపని నానా విధాలుగా ప్రశ్నించి వాక్రుచ్చిన సత్యం.

"సరిగమ... పాథనీ..."

"నీ".. యిదే నిషాదంరా అమ్మలూ?"

"కేశికి"

"కే... కాదూ... కై... కైశికి అనాలి" వాళ్లమ్మ మత్ప్రియురాలు వాగధీశ్వరి.

"ఊఁ... కేశికి..." దానికింకా 'కై' పలకడం రాలే. షోడశ స్వరాలు తెలిసాయి గానీ...!

"నాన్నారు భోంచేస్తున్నారు ఎంగిలి చేత్తో యిట్రాకు. వెళ్లవే కుంకుముండా! అయ్యో... ఎడం చేయి వారి కంచంలో పెట్టేసిందండీ దొడ్డమ్మగారూ...!"

ఆక్రోశిస్తూ, అరుస్తున్న నా భార్యని వారిస్తూ అమ్మ అన్న మీగడ తరగల పలుకులు : "బాలౌచ్ఛిష్టానికీ, భగవత్ప్రసా దానికీ సామ్యమే పిచ్చి ముండా....!"

ఇదే... యిదే... చిన్న బుల్లి హస్తం... ఎర్ర కలువ మొగ్గలా... జపాకుసుమమై వికసిస్తూ... వాళ్లమ్మ ఎంగిలి అందని... ఎడంచేయి నా కంచంలో పెట్టి, "దా... యింద... తి...నూ...!" అని నా కంచంలోదే అరటి మొవ్వ కూర పలుకుని ఆ వామ హస్తంతో పట్టి... ఆ చిన్ని ముద్దు వేళ్లు నా పెదవులని తాకుతోంటే...

యిదే చేయి మీటింది... యదుకుల కాంభోజి...!

* * *

"నానమ్మ మాటాడ్డేం నాన్నా! నానా! నానమ్మని మాటాడమన్జెప్పు నానా! యెందుకు నానా యేడుస్తున్నావ్... నానా? నానా! నానమ్మని అట్లా ముల్లు చాప మీద పడుకోబెట్టొద్దు నానా! ప్లీజ్... నానమ్మకి గుచ్చుకుంటుంది... నానా...! నా...న...మ్మా...!"

'అమ్మలూ, నానమ్మ చచ్చిపోయిందే' అని ఎనిమిదేళ్ల ఆ అపర సరస్వతికెలా చెప్పనూ...??

ముల్లు చాప యీనెల్ని సవరిస్తున్న ఆ వామ హస్తపు చిగురు వేళ్లని దేంతోటి తోసెయ్యనూ... చీరుకుపోతాయే చిన్న వేళ్లని...?

కోకిల ప్రియ జన్య కౌమారి...!

* * *

అనాహతనాద సాధన కోసం అఖండ జ్యోతి ముందు పద్మాసనం వేసుకుని ముఖపద్మం మీద రెండు కలువ రేకులు కప్పుకుని...

ఉచ్ఛ్వాస నిశ్వాసలు ప్రణవమై -

"పదహారేళ్ల పిల్లకి ఈ సాధనలేమిటండీ...? ఎట్లా వణికిపోతోందో చూడండి!"

తల్లి పక్షి రెక్కలు తపతపా కొట్టుకుంటూ.... తల్లడిల్లితే...

"వట్టినే ధ్యానం చేసుకుంటున్నానే పిచ్చమ్మా...!" అని వాళ్లమ్మ మెడ చుట్టూ చేతులు వేసి బుగ్గమీద నిండుగా ముద్దర్లు వేసిన ఆ ముద్దరాలు...

...నా కంటికి నట భైరవే...!

* * *

"బి.ఎస్సీ మైక్రోబయాలజీ తీసుకుంటా నాన్నా...!"

'అన్నింటా సూక్ష్మదృష్టే తల్లీ నీకు' అనుకుని, హాస్టల్ ప్రెమిసెస్‌లో వదిలి వచ్చేస్తూ వెనుదిరిగి చూస్తే, –

ఆత్మవిశ్వాసం కళ్ల నిండా నింపుకుని "అమ్మని బెంగపెట్టుకోకన్చెప్పా... నువ్వే సముదాయించు... తట్టుకోలేదు అమ్మ... పాపం... జాగర్త నాన్నా!"

తల్లికీ తండ్రికీ తల్లయిన శ్యామకల్యాణి !

* * *

మీ అమ్మాయిని వేణుగోపాలస్వామి ఆలయంలో పాడుతోంటే చూసాము. మా కళాక్షేత్రం వార్షికోత్సవంలో అమ్మాయి కచేరి పెట్టించాలనుకుంటున్నాం మీరు వప్పుకుంటే..."

"నేను కాదు అంగీకరించాల్సింది అమ్మాయ్" అన్నేనంటే –

"క్షమించండి... నేనింకా అభ్యాస దశలోనే ఉన్నాను. నాన్నగారి ముందే గొంతు విప్పలేను... అపరిపక్వ గానాన్ని జనాలకి వినిపించలేను."

వినమ్ర సత్యవతి...!

* * *

కాలం కనికర రాహిత్యానికి నిదర్శనమన్నట్లు ఆ రాత్రి... నర్సింగ్‌హోమ్ ఏ.సీ. రూమ్‌లో... బ్యాక్‌రెస్ట్ కానుకుని ఆయాసపడుతూ వాగధీశ్వరి, ముప్ఫైఏళ్ల సాహచర్యం యిక చెల్లు అంటున్నట్టు వగరుస్తూ...!

"అమ్మలూ...! నాన్న జాగర్తే... ఉప్పు తక్కువేసి అన్నం పెట్టు... నెయ్యి ప్రాధేయపడినా వేయకు. వేకువనే దేవతార్చనకి నిత్యమల్లెలు కోసి దర్భచా...!" అనంత వాయువుల్లో లీనమైన నా మనో వాయులీన తరంగం...!

ఆ ఏ.సీ. గదిలో కళ్లలోంచీ నిరామయత స్రవిస్తూ... వాళ్లమ్మ తల నిమురుతూ... నా చేయి పట్టుకుని, వాళ్లమ్మకి యిష్టమైన మేఘమల్హార్ ఆలపించిన చారుకేశి !

* * *

"టు హెల్ విత్ యువర్ ఫకింగ్ మ్యూజిక్... నోరెత్తావంటే చంపేస్తా... సా...పా...సా... అయ్ కాంట్ టాలరేట్ దట్ నాన్సెన్స్... వినబడిందా...? గో... గెట్ సమ్ ఐస్ క్యూబ్స్!"

బైట క్లబ్బులో తాగి, యింటికొచ్చి యింట్లోని నిద్రవీణని రుద్రవీణ చేస్తున్న నా అల్లుడు... ప్రముఖ సర్జన్... ఎఫ్ఫార్సీయస్...!

ఐస్క్యూబ్స్ నిండుగా వున్న ఐస్‌పేల్‌ని టీపాయ్ మీద పెడుతూ మామిడి తోరణం లాంటి చిర్నవ్వుతో...

"యూసీ మిస్టర్... యుకెన్ హ్యూమిలియేట్మీ. బట్ యు కాంట్ యిన్సల్ట్ మ్యూజిక్. మీకు అసలు సంగీతం అన్న పదముచ్చరించే అర్హత కూడా లేదు. మాటలు మీరితే నష్టపోయేది నేను కాదు...!"

నా ప్రాణానికి ప్రాణం నా అమ్ములి కాపురం చూట్టానికొచ్చిన నా గుండెలో ముల్లు!

"యేవిటే వాగుతున్నావ్... అయిసే ఫక్.. ఎగైన్ ఫక్ యువర్ యాస్హోల్ మ్యూజిక్... ఇంట్లో యింకోసారి గొంతెత్తి పాడావంటే నీ నోట్లో విస్కీ పోసి కడుగుతాలం...!"

ఆకాశం విరిగి పడకుండా అట్లాగే వుంది! భూదేవి భిన్నం కాకుండా నిబ్బరంగా ఉంది!

"అమ్మా"

గోడకి జారగిలపడిపోయి కూచుని తల్లడిల్లుతూన్న నా చుట్టూ చేతులేసి,

"నాన్నా! లే... మనుషులైతే వాదించి చెప్పగలం లే...పద. ఈ శ్మశానం నించీ బైట తోటల్లోకెళ్దాం...దా!" భద్రకాళి నా అమ్ములు... మహోదగ్ర రుద్రప్రియా రాగమై...!

నిశాంత దిగంతాన్ని స్వర్ణరేఖ చీలుస్తున్నప్పుడు దేవతార్చనకి నిత్యమల్లెలూ, గన్నేరులూ, తులసి దళాలూ పెడుతూ, "నాన్నా! మధ్యాహ్నం భోజనానికి చక్రవర్తిగారని వస్తారు. నీ దగ్గర పాఠాలు నేర్చుకున్నాయనే... బెంగాలీలు... నా మనసెరిగిన వాడు అతను... నేను మళ్లీ వివాహం చేసుకోవాలనుకుంటున్నాను. చక్రవర్తిగారు నీతో మాట్లాడ్తారు!"

గోడకానుకుని కూచుంది అమ్ములు...!

అఖండజ్యోతి వెలుగులు ఆ పసిడి మొహం మీద పరుచుకుని దేవుడి గది నిండా స్వర్ణజ్యోత్స్నను నింపుతున్నాయి.

లేవడానికిబ్బంది పడ్తోంటే వడలిన దేహం చుట్టూ చేతులేసి నా కాసరాయై నన్ను బైటికి నడిపిస్తూ ప్రభాత సంధ్య వెలుగుల్లోకి నా తల్లి కల్యాణ వసంతమై...!